క్లుప్తంగా

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఉసేన్‌స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. వచ్చే వారం నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుండటంతో జిల్లాతోపాటు,కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఫాతెహాలు సమర్పించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

డోన్ టౌన్ : పట్టణానికి చెందిన మూడు నిరుపేద కుటుంబాలకు గురువారం స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆలా మధు దాతల సహకారంతో బియ్యంతో పాటు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. ఆలా మధుతోపాటు దాతలు ఈశ్వర్‌సింగ్, వెటర్నరీ ఉద్యోగి రవికుమార్, పెట్రోల్ బంక్ వలికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మెజిస్ట్రేట్ హనీషా

డోన్ : ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని డోన్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ హనీషా సూచించారు. పట్టణంలోని షాధిఖానలో క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ, శాంతిరామ్ మెడికల కాలేజ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నంద్యాల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. డాక్టర్లు వంశీకృష్ణ, రమేష్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు అన్ని వసతులు

సంజామల(కోవెలకుంట్ల): బాలుర, బాలికల వసతిగృహాల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని సంజామల బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారి మునిరాజు తెలిపారు. గురువారం హాస్టల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ఉదయం, రాత్రి వేళల్లో విద్యార్థులకు నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు.

ఓటర్ కార్డుతో ఆధార్ అనుసంధానం చేయాలి

బనగానపల్లెరూరల్ : ఓటరుకార్డుతో ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని నంద్యాల జిల్లా స్పెషియల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్ఆర్‌బీసీ), బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కామేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సువర్ణమ్మ ఆధ్వర్యంలో ఆధార్ అనుసంధానం ప్రక్రియపై బూత్‌లెవల్ ఆఫీసర్స్(బీఎల్ఓ)తో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీలోపు 95శాతం ఓటర్‌కార్డుకు ఆధార్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

డోన్ రూరల్ : ప్రతిఒక్కరూ ఓటు ఐడీకి ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించుకోవాలని తహసీల్దార్ విద్యాసార్ సూచించారు. పట్టణంలోని 11,12,13 వార్డుల్లోని సచివాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ఈనెల19లోపు ఆధార్ లింక్ చేసే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రజలు ఆధార్ లింక్ చేసుకోవడానికి మీ పరిధిలోని బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బనగానపల్లెరూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని సీఐ సుబ్బరాయుడు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ క్రీడామైదానంలో ఫ్రెండ్స్‌బ్లెడ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సీఐ ప్రారంభించి మాట్లాడారు. ఎంతో మంది వివిధ ప్రమాదాల బారీన పడి సరియైన సమయంలో రక్తం లభించక ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని, ఇలాంటి బాధితులకు రక్తదానం చేయడం ఎంతో పుణ్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్, ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు షాషావలి, మౌలా, ముజీబ్, శివ, సతీష్, అత్తార్ ఆరిఫ్, జావీద్, దాదాపీర్, సాయిరామ్,రఫీ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో వడగండ్ల వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో గురువారం రాత్రి వడగండ్ల వర్షం కురిసింది. రాత్రి 8గంటలకు ప్రారంభమైన వర్షం ఏకదాటిగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో పడింది. వేసవి కాలం ప్రారంభంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప దిగుబడులను రైతులు కల్లాల్లో ఆరబోసుకున్నారు. అకాల వర్షం కురియడంతో దిగుబడులను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. పలు ప్రాంతాల్లో విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ప్రభుత్వ బడులు కళకళ!



రూపు, రేఖలు మారిన మల్యాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల

- నాడు–నేడుతో మారిన రూపురేఖలు
- మొదటి విడతలో 25 పాఠశాలల్లో మౌలిక వసతులు
- రెండవ విడతలో 60 స్కూళ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులు



సుదరంగా పాఠశాల ఆవరణ



అందమైన బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

డోన్ రూరల్ : విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మార్చేస్తుంది. చిన్నారులను బడికి పంపే ఏ తల్లి ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వంఅమ్మఒడి పథకంతోపాటు యూనిఫాం, షూస్, పుస్తకాలు సకాలంలో సరఫరా చేస్తుండడంతో ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మౌలికవసతులు కల్పించడంతో ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయి. ఏళ్లతరబడి కనీస మరమ్మతులకు నోచుకోని బడులు నేడు అన్ని వసతులతో రూపుదిద్దుకున్నాయి. విద్యార్థులకు అనుగుణంగా రంగులతో కూడిన డెస్కులు, విద్యుత్ సౌకర్యం, టాయిలె ట్స్, ప్రహరీ, ఫిల్టర్ వాటర్, పేయింట్, గ్రీన్‌బోర్డు తదితరాలు ఏర్పాటు చేయడంతో చిన్నారులు ఉత్సాహంగా విద్యనభ్యశిస్తున్నారు.బడులను అన్నివిధాలుగా తీర్చిదిద్దడంతో విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. అదేవిధంగా ఉన్నత విద్యను ప్రోత్సహిస్తూ విద్యా, వసతి దీవెన పథకాలు అమలు చేస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. డోన్ మండలంలో జిల్లా పరిషత్ – 22, ప్రాథమిక పాఠశాలు–63(కస్తూర్బా, మోడల్ స్కూల్) ఉన్నాయి. నాడు– నేడు కింద మొదటి విడతలో 25 స్కూళ్లను ఎంపిక చేసిన ప్రభుత్వం రూ. 5 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ఆ స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయి. అదేవిధంగా రెండవ విడతలో మిగిలిన 60 స్కూళ్లను ఎంపిక చేసిన ప్రభుత్వం రూ. 25 కోట్లు కేటాయించింది. ఈ మేరకు ఆయా స్కూళ్లలో వివిధ దశల్లో పనులు సాగుతున్నాయి.

తొలగిన ఇబ్బందులు...

గత ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా సర్కార్ బడులు సమస్యలకు నిలయాలుగా ఉండేవి. చాలా స్కూళ్లలో పెచ్చులూడి విద్యార్థులకు గాయాలైన సంఘటనలు లేకపోలేదు. ఇక వర్షాకాలం విద్యార్థుల తోపాటు ఉపాధ్యాయుల సమస్యలు వర్ణనాతీతం. స్కూళ్లలోకి వర్షపునీరు చేరి పడరానాపాట్లు పడ్డారు. విద్యారంగానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేడు–నేడు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ సర్కార్ బడుల్లో నెలకొన్న ఇబ్బందులను తొలగించింది. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే కాకుండా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు నిర్మిస్తుంది. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పిస్తున్నాం



మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఇప్పటికే మొదటి విడతలోఎంపికైన 25 స్కూళ్లలో అని సౌకర్యాలు కల్పించాం. రెండవ విడతో ఎంపికైన స్కూళ్లలో వివిధ దశల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతగా అభివృద్ధి పనులు చేయిస్తున్నాం.

– డోన్ ఎంఈఓ ప్రభాకర్

చాలా సంతోషంగా ఉంది



పాఠశాలలను చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. గతంలో పిల్లలు చాలా ఇబ్బంది పడేవారు. ప్రైవేట్ స్కూళ్ల కంటే ప్రభుత్వ పాఠశాలలే బాగున్నాయి. విద్యార్థులు కూడా బాగా చదువుకుంటున్నారు. సర్కార్ స్కూళ్లను అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాయం మరువం.

– ఓబులేష్, లక్ష్మంపల్లి గ్రామం

ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యారంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దడం సంతోషకరం. గతంలో అత్యవసరాలకు చిన్నారులు చాలా ఇబ్బంది పడేవారు. ఇప్పుడా సమస్య తీరింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– యు.మధుసూదన్‌బాబు, కమలాపురం గ్రామం

మహిళ ఆత్మహత్య

సంజామల(కోవెలకుంట్ల):సంజామల మండలం అల్వకొండ గ్రామానికి చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం ఎస్ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన ఫాతిమాబీ(58) కుమారుడు, కోడలు తరుచూ గొడవ పడుతుండేవారు. పలుసార్లు వారించినా వినకపోవడంతో ఫాతిమాబీ జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందింది.మృతురాలి భర్త పెద్దబాబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్యాపిలి: పట్టణంలోని స్థానిక శివసాయి ఇంగ్లిష్ మీడియం పాఠశాల 20వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎస్ఐ సీఎం రాకేశ్ తదితరులు విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో విద్యాబుద్ధులు బాగా నేర్చుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతంగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలకృష్ణుడు, కరస్పాండెంట్ సురేశ్ కుమార్, హెచ్ఎం దేవి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మద్దయ్య, సీఆర్పీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

డోన్ రూరల్: పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు నాగార్జున, సభ్యులు నాగేంద్ర, సుబ్బయ్య, సర్వేశ్వరయ్య, గిరి, వెంకటేశ్వర్లు, శివకుమార్, సుంకన్న, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ పనులను పరిశీలించిన అధికారులు



పాపసాని కొట్టాలలో ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

బేతంచెర్ల: మండలంలో జరుగుతున్న వాటర్ గ్రిడ్, జలజీవన్ పథకం కింద చేపట్టిన కుళాయి, పైపులైన్ పనులను కేంద్ర జల శక్తి శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సోమశేఖర్ ఆధ్వర్యంలో కేంద్ర జల శక్తి శాఖ అధికారులు నిర్మల్ సితార, కుల్‌దీప్ కుమార్ బద్‌యాల్ తదితరులు పాపసాని కొట్టాల, హెచ్ కొట్టాల గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కుళాయిల ద్వారా నీరు వస్తున్నాయా లేదా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. వాటర్‌గ్రిడ్ ఏఈ బాల కృష్ణ ఆధ్వర్యంలో గోరుకల్లు నుంచి చేపడుతున్న వాటర్ గ్రిడ్ పనులను వారు పరిశీలించారు.

రైతు మిత్ర గ్రూపునకు ట్రాక్టర్ అందజేత



రైతులకు ట్రాక్టర్‌ను అప్పగిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండలంలోని గొర్విమానుపల్లెకు చెందిన రైతు మిత్ర గ్రూపు సభ్యులకు గురువారం కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద 40 శాతం సబ్సిడీతో స్వరాజ్ కంపెనీకి చెందిన ట్రాక్టర్‌ను వ్యవసాయాధికారి పవన్‌కుమార్ అందజేశారు. ఏఓ మాట్లాడుతూ రైతులు గ్రూపు ఏర్పాటు చేసుకుని వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్లను సబ్సిడీపై పొందాలని సూచించారు. కార్యక్రమంలో అవుకు కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ హుసేన్, రైతు గ్రూపు కన్వీనర్ శివశంకరయ్య, ఎంపీటీసీ సభ్యుడు పులి ప్రకాష్‌రెడ్డి, ఏఈఓ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సభ్యుల నియామకం



న్యాయవాది మండ్ల రఘురామిరెడ్డి



న్యాయవాది వీ.ప్రకాష్‌రెడ్డి



సోషల్‌వర్కర్‌గా వెంకటసుబ్బయ్య

బనగానపల్లె: బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టులో లోక్ అదాలత్ సభ్యులుగా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాదులు మండ్ల రఘురామిరెడ్డి, వీ ప్రకాష్‌రెడ్డితో పాటు సోషల్ వర్కర్‌గా ఆర్య వైశ్యసంఘం నాయకుడు డి. వెంకటసుబ్బయ్య నియామకం ఏపీ న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జరిగింది. మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్‌గా స్థానిక జడ్జీ ఉంటారని, మరో ఇద్దరు న్యాయవాదులు సభ్యులుగా మరోకరు సోషల్ వర్కర్‌గా ఉంటారని కోర్టు సిబ్బంది తెలిపారు. వీరు ఉన్నత న్యాయస్థానాలు నిర్వహించే లోక్‌అదాలత్ నిర్వహణలో కమిటీ సభ్యులుగా కొనసాగుతారని కోర్టు సిబ్బంది తెలిపారు.

డోన్ నుంచి గద్దెరాళ్ల మారెమ్మ అవ్వకు బోనాలు



ఊరేగింపుగా వెళ్తున్న బుడగ జంగాలవాసులు

డోన్ టౌన్: కర్నూలు జిల్లా దేవనకొండ మండలం గద్దెరాళ్ల గ్రామంలో కొలువైన శ్రీమారెమ్మ అవ్వకు బోనాలు సమర్పించేందుకు డోన్ నుంచి బుడగ జంగాల వాసులు వందల సంఖ్యలో తరలి వెళ్లారు. పట్టణంలోని పోచా ప్రభాకర్‌రెడ్డి కాలనీ(జంగాల కాలనీ)కి చెందిన పలు కుటుంబాలు గురువారం సాయత్రం మేలతాళాలతో బీరప్ప డోలు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా బోనాలతో తరలివెళ్లారు.

అమ్మవారి హుండీ లెక్కింపు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలోని హుండీల్లో భక్తుల కానుకల ద్వారా ఆలయానికి రూ.35,38,695 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధిరి రామానుజన్ తెలిపారు. గురువారం ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలోని హుండీల్లో గతేడాది నవంబరు 11వ తేది నుంచి ఇప్పటి వరకు వేసిన కానుకల లెక్కింపు కార్యక్రమం జరిగింది. లెక్కింపు కార్యక్రమంలో కోవెలకుంట్లకు చెందిన శ్రీ సత్యనారాయణ సేవా సమితి సభ్యులతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న పీఎస్ఎస్ నారాయణ

కోవెలకుంట్ల: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని ఆర్యవైశ్య అఫిసియల్స్, ప్రొఫెషనల్స్ సంఘం అధ్యక్షుడు కాల్వ నాగేశ్వరరావు అన్నారు. అమరజీవి జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక అమ్మవారిశాల ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నలిగిపోతున్న తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పెండేకంటి సుబ్రహ్మణ్యం, నాగరాజు, ఇస్కాల ప్రసాద్, సందీప్, కాల్వ శివనాగయ్య, శ్రీనివాసులు గుప్త, నాగభూషణం,పెండేకంటి మణికంత, కాల్వ కార్తీక్, జయకృష్ణ,సముద్రాల సందీప్, దినేష్ పాల్గొన్నారు.

డోన్ టౌన్: తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాముల సేవలు చిరస్మరణీయం అని డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొట్రికె హరికిషన్ అన్నారు. పొట్టి శ్రీరాముల జయంతిని పురస్కరించుకుని గురువారం ఆవోపా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక రైల్వే గేట్ల మధ్య ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పోరాట ప్రతిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆవోపా సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాకం కృష్ణకిషోర్, జొన్నలగడ్డ శ్రీనివాసుల శెట్టి, సభ్యులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: స్థానిక పాతబస్టాండ్‌లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతిని నిర్వహించారు. మరజీవి త్యాగాలను వాసవీ క్లబ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య బళ్లా ని, గుప్త గుర్తు చేశారు. అదేవిధంగా మండల పరిధి లోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం శివకుమారస్వామి, యాజమాన్య కమిటీ చైర్మన్ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ సభ్యులు శ్రావణ్, లక్ష్మినారాయణ, జనార్దన్, విష్ణు, కందగడ్డల మోహ న్‌రావు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: స్థానిక ఆర్యవైశ్యభవనంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు పీఎస్ఎస్ నారాయణ మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం ఎనలేదన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శివచంద్రయ్య, నాయకులు నూకల విజయకుమార్, జగంశెట్టి, శ్రీరామ వెంకట సుబ్రహ్మణ్యం, గుండా రవికుమార్, టంగుటూరి శీనయ్య, రామక్రిష్ణ, సురేంద్రబాబు, శివరాజ్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు రాతి దూలం లాగుడు పోటీలు

డోన్ టౌన్: మండల పరిధిలోని వెంకటాపురంలో శుక్రవారం పాలపండ్ల ఎద్దులకు రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, కల్లూరు కుటుంబ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంది విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా దివంగత కల్లూరు రామిరెడ్డి, సుంకులమ్మ దంపతుల జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలైన వృషభరాజ యజమానులకు వరుసగా రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు చొప్పున కల్లూరు కుటుంబ సభ్యులు అందించనున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

బనగానపల్లె: మండలంలోని నందివర్గం గ్రామంలో గద్దల జనార్దన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ ఎస్ఐ రామాంజనేయరెడ్డి గురువారం తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఊసల మద్దమ్మ అనే మహిళ తన ఇంటిముందు మెట్లు నిర్మించుకుంటుండగా తొలగించాలని గద్దల జనార్దన్ దుర్భాషలాడాడన్నారు. ఆమెతో పాటు భర్తపై కూడ దాడికి పాల్పడినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొందని, ఈ మేరకు జనార్దన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని వాటర్ వర్క్స్ సబ్ స్టేషన్‌లో మరమత్తుల కారణంగా రెండు రోజుల పాటు శుక్ర, శనివారాలు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని వైయస్ నగర్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్, టీచర్స్ కాలనీ, తారకరామనగర్, ఆర్టీసీ కాలనీ, సుందర్ సింగ్ కాలనీలతో పాటు మండలంలోని మల్లెంపల్లె, లక్ష్మంపల్లె, బొంతిరాళ్ల గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయత్రం 5గంటల వరకు రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉంటుందని, రైతులు గమనించాలని ఆయన కోరారు.

గేట్‌లో అవుకు వాసికి ర్యాంక్



సాత్రి ప్రమోద్ కుమార్

అవుకు: దేశ స్థాయిలో జరిగే గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆఫ్ ఇన్ ఇంజినీరింగ్) పరీక్షల్లో అవుకు వాసి ర్యాంక్ సాధించాడు. అవుకు పట్టణానికి చెందిన సాత్రి రామయ్య, సాత్రి అనురాధ దంపతుల రెండవ కుమారుడు అయిన సాత్రి ప్రమోద్ కుమార్ మొదటి నుంచి చదువులో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ వచ్చేవాడు. 10వ తరగతిలో 93.8శాతం, ట్రిపుల్ ఐటీ బాసరలో బీటెక్ సీఎస్సీలో 92.4శాతం మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే గత నెల4వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించిన గేట్ పరీక్షల్లో పాల్గొన్నాడు. దాదాపు 8 లక్షల మంది పాల్గొన్న పరీక్షలో సాత్రి ప్రమోద్ కు మార్ ఉత్తమ ప్రతిభను కనబరిచి 384వ ర్యాంక్‌ను సాధించడంతో తల్లిదండ్రులతో పాటు,సన్నిహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలు అన్నిరంగాలలో రాణించాలి





లెమెన్ స్పూన్ పోటీలలో పాల్గొన్న మహిళలు, విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

డోన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ఐక మత్యంగా కృషి చేయాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లు అన్నారు. డోన్ మున్సిపాలిటీ పాలకవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నెహ్రూ నగర్ పార్కులో పొదుపులక్ష్మి మహిళలతో పాటు మహిళా కౌన్సిలర్ల కు ఏర్పాటు చేసిన ఆటల పోటీలను గురువారం వా రు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళా ఆర్థికాభివృద్ధికి చేస్తు న్న కృషిని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంభనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. షాట్‌పుట్ పోటీలలో ఇంద్రజ, రామేశ్వరి, సుగుణ వరుస స్థానాలను కైవసం చేసుకున్నారు. స్టార్ మహిళ పోటీలలో రామేశ్వరి, ఇంద్రజ ప్రథమ, ద్వితీయ స్థానాలు, వాటర్ మిలాన్ పోటీలలో సాధిక, లక్ష్మిదేవి వరుస స్థానాలు, బెలూన్ గేమ్స్‌లో పూజిత, రజియా, సువర్ణలు వరుస స్థానాలు, లెమెన్ స్పూన్ పోటీలలో కీర్తి, భవానీ వరుస స్థానాలను సాధించారు. మ్యూజికల్ చైర్స్‌లో రమ్య, మంజుల, స్నేహలత వరుస స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మంత్రి పీఏ మహేశ్వరరెడ్డి బహుమతులు అందజేశారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల పరిశీలన

డోన్ టౌన్ : పట్టణంలో జరుగుతున్న ద్వితీయ ఇంటర్ పరీక్ష కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్‌తోపాటు జి ల్లా పరీక్షల కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, శ్రీసుధ, వెంకటేశ్వర కళాశాలలోని కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్ అధికారి అన్వర్‌బాషా, డీఈసీ కమిటీ సభ్యులు లారెన్స్, గోవిందరాజు పరిశీలించారు.

కొలిమిగుండ్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలను ఎస్ఐ రమేష్‌రెడ్డి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలించారు. సెంటర్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి పలు సూచనలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్, ఎగ్జామ్ చీఫ్ శ్రీనివాసులతో కలిసి ఏర్పాట్ల గురించి చర్చించారు.

బేతంచెర్ల: పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలను ఎస్ఐ శివ శంకర్ నాయక్ గురువారం పరిశీలించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద ఏలాంటి ఇబ్బందులు తలెత్త కుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు విద్యార్థుల గైర్హాజరు

కోవెలకుంట్ల: పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర తెలుగు పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 202 మంది విద్యార్థులకు 197 మంది, పట్టణ శివారులోని గురుకుల కళాశాలలో 180 మందికి 179 మంది పరీక్షకు హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపర్‌వైజర్లు మద్దిలేటిస్వామి, పిర్దొస్ అంజుమ్ తెలిపారు. రామలింగారెడ్డి, శంకర్‌రెడ్డి ఆయా పరీక్షా కేంద్రాలకు డిపార్ట్‌మెంటల్ అధికారులుగా వ్యవహరించారు.

గ్రామోత్సవం

డోన్ టౌన్: మండల పరిధిలోని వెంకటాపురంలో శుక్రవారం నంది విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గురువారం వేద పండితులు జలవాసం నుంచి వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.